క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 3, 4వ డివిజన్‌లలోని వెంకటేశ్వరకాలనీ, సీఎంఆర్ కాలనీల్లో గురువారం సీసీ, బీటీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మేయర్ చిగురింత పారిజాత ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ జ్యోతిరెడ్డి, కార్పొరేటర్లు రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు దిండు శ్రీనివాస్‌గౌడ్, ఏదుళ్ల ప్రతాప్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, జెల్లా రమేశ్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



షెడ్‌ను కూల్చివేస్తున్న కార్పొరేషన్ అధికారులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో సర్వే నెంబర్ 180/ఏలో 11 వందల గజాలలో అక్రమంగా నిర్మించిన షెడ్‌ను గురువారం నేలమట్టం చేశారు. కమిషనర్ సరస్వతి ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ అనుమతి లేకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే మున్సిపాలిటీ చట్టం–2019 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించిన నిర్మాణ దారులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. బడంగ్‌పేట్ నగర పాలకసంస్థ పరిధిలోని ప్రజలందరూ కార్పొరేషన్ అనుమతి తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

ప్రమాదకరంగా బోరుబావి



మూతలేని బోరుబావి

కొత్తూరు: మూతలు లేని బోరుబావుల్లో చిన్నారులు పడి మృత్యువాతపడుతున్న ఘటనలు ఆయా ప్రాంతాల్లో తరచూ చోటు చేసుకుంటున్నాయి. అయినప్పటికీ మండలంలో ప్రమాదకరంగా మారిన బోరుబావులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో గల వైకుంఠధామం ఆవరణలో గతంలో బోరు వేశారు. అనంతరం దానికి మోటార్ బిగించకుండా బోరుబావి పైపు పైభాగంలో రాయిని మూతగా పెట్టారు. రాయి తొలగిపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకముందే అధికారులు స్పందించి బోరుబావికి మూత ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వీరన్నపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రవికుమార్ తెలిపారు. మండలంలోని పద్మారం, వీరన్నపేట, పెద్దఎల్కిచర్ల, గాలిగూడ, జిల్లేడ్, జాకారం, చేగిరెడ్డి ఘనాపూర్, చెన్నారెడ్డిగూడ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైతులకు ప్రాధాన్యత
ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



వనంపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: మండలంలోని అన్ని గ్రామాల్లో 2025–26 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో చేపట్టబోయే పనుల ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రణాళికలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, డీటీ భాస్కర్, ఏ ఈ వంశికృష్ణ, శ్రీకాంత్, ఏఓ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముక్కోటికి ముస్తాబు

- మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఘనంగా ఏర్పాట్లు
- ఎల్లప్పుడూ ఉత్తర ముఖంగా దర్శనమిచ్చే స్వామివారు
- ఉదయం నుంచే బారులు తీరనున్న భక్తులు



గర్భగుడిలో మత్స్యావతార వేంకటేశ్వర స్వామివారు



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి దేవాలయం

మీర్‌పేట: దేశంలోనే ఉత్తర ద్వారంలో వెలసిన ఏకైక దేవాలయంగా ప్రసిద్ధి గాంచిన మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వేంకటేశ్వరస్వామి దేవాలయం ముక్కోటి ఏకాదశికి ముస్తాబైంది. వందల ఏళ్ల చరిత్ర కలిగి ఉండడంతో పాటు ఎల్లప్పుడూ స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చే ఏకైక దేవాలయం కావడం ఇక్కడి విశిష్టత. అదేవిధంగా స్వామివారు మత్స్యావతారంలోని విష్ణువు దేహం వలె ఉండగా, శిరస్సు లింగాకారంలో ఉండటం మరో విశేషం. మీర్‌పేటతో పాటు నగరం నలు మూలల నుంచి భక్తులు ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశికి ఆలయానికి పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

ప్రత్యేక ఆకర్షణగా నేలమాలిగలు

దాదాపు 500 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయంలోని నేలమాళిగలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. గతంలో శిథిలావస్థకు చేరుకోగా ఆలయ అధికారు లు, డైరెక్టర్లు చొరవ తీసుకుని నేలమాళిగలను అందుబాటులోకి తెచ్చారు. దేవతా మూర్తుల విగ్రహాల ను ఏర్పాటు చేయడంతో పాటు భక్తులు దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయడంతో స్వా మి వారిని దర్శించుకున్న అనంతరం భక్తులు నేలమాళిగలోని దేవతా మూర్తులను దర్శించుకుంటారు.

> **ఏర్పాట్లు పూర్తి చేశాం**
>
> ఎంతో ప్రత్యేకత, చరిత్ర కలిగిన ఆలయాన్ని వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి వస్తారని, ఇందుకోసం ప్రత్యేకంగా క్యూలైన్లు సిద్ధం చేశాం. దీంతో పాటు బందోబస్తు నిర్వహించాలని స్థానిక మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌ను కలిసి కోరడంతో పాటు ఆహ్వానించాం.
>
> –శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి

మంత్రుల ఇళ్ల ముట్టడిని జయప్రదం చేయండి



వైద్యురాలికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశవర్కర్లు

కందుకూరు: సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆశవర్కర్లు చేపట్టనున్న మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం కందుకూరు పీహెచ్‌సీలో వైద్యురాలికి ఆశవర్కర్లు విధులకు గైర్హాజరవుతున్నారని తెలుపుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆశవర్కర్లు 20 ఏళ్లుగా గ్రామాల్లో ఎంతో సేవ చేస్తున్నా కనీస ఉద్యోగ భద్రత కరువైందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం వారితో వెట్టిచాకిరీ చేయించడం వరకే పరిమితమైందని విమర్శించారు. నెలకు రూ.18వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, భీమా, ఈఎస్‌ఐ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేసేలా ఆశలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మహేశ్వరం మండల కన్వీనర్ శేఖర్, ఆశవర్కర్లు ముంతాజ్, అష్రోఫ్, శ్రీలత, జయసుధ, ప్రేమలత, అనిత, సురేఖ, సంధ్య, గీత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి చర్యలు

- గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిధర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడంతో పాటుగా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 2015 నుంచి సర్వీసు రూల్స్‌ను అమలు చేయకపోవడంతో ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో జూనియర్ లెక్చరర్లు, ఎంఈఓలు, జీహెచ్‌ఎంలకు పదోన్నతులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదోన్నతులు ఇచ్చిందన్నారు. మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలను హెచ్‌ఎంల నుంచి తప్పించి ఏజెన్సీలకు ఇవ్వాలని కోరారు. మధ్యాహ్న భోజనంలో ఏ చిన్న పొరపాటు జరిగినా హెచ్‌ఎంలను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ప్రభుత్వం ప్రీ ప్రైమరీ పాఠశాలలను కూడా ఏర్పాటు చేయాలని, విద్యార్థులను కావాల్సిన మరిన్ని సదుపాయాలు కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్‌రాథోడ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మనోహర్, యూటీఎఫ్ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిందితులను కఠినంగా శిక్షించాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: హైద్రాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై, నాయకులపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను కఠినంగా శిక్షించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుల దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న ఎస్సీ మోర్చా నాయకుడు నందరాజ్‌ను గురువారం వెంకటేశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీలు పరస్పరం విమర్శలు చేసుకోవాలే తప్పా దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన కాంగ్రెస్ నాయకులు, ప్రజల పక్షాన అడిగిన వారిపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక శాంతి భద్రతలను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. బీజేపీ క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, దాడులు చేయాలనుకుంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు బయట తిరగరన్నారు. ఇప్పటికైనా దాడులు మానుకొని ప్రజల హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేయాలని సూచించారు. పరామర్శించిన వారిలో బోసుపల్లి ప్రతాప్, విఠ్యాల నర్సింలు ఉన్నారు.

కల్యాణ వైభోగమే..

- రెండోరోజు కొనసాగిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- స్వామివారి కల్యాణోత్సవానికి భారీగా హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మొయినాబాద్‌రూరల్: ముత్యాల పందిరి, పచ్చని మామిడి తోరణాల అలంకరణతో శ్రీ దేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గురువారం మండల పరిధిలోని కనకమామిడి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి బ్రహోత్సవాల్లో భాగంగా రెండోరోజు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, అర్చకుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం జరిపించగా.. ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి తలంబ్రాలు, పూలు సమర్పించారు. ఈ కల్యాణ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. దీంతో దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

నేడు వైకుంఠ ద్వార దర్శనం

వేంకటేశ్వరస్వామి ఉత్తర దర్శనాన్ని శుక్రవారం ఉదయం 5 గంటలకు ప్రారంభిస్తామని ఆలయ చైర్మన్ కొండా లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు పరంకుశ నరేంద్రచార్యులు తెలిపారు. భక్తులు క్యూలో ఉండి స్వామివారిని దర్శించుకోవాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వారు పేర్కొన్నారు.


ఘనంగా సంక్రాంతి సంబురాలు

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న సాంఘీక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు రంగు రంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులను ధరించి ప్రత్యేక వస్త్రాధారణలో ఆకర్షణగా నిలిచారు. విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో అలరించాయి. ప్రిన్సిపల్ నీతా మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు మహిళలు తీర్చిదిద్దే రంగవల్లులు హరివిల్లులను తలపిస్తాయన్నారు. మన పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. పండుగల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

చేవెళ్ల: పేద విద్యార్థులకు చేయూతనందించేందుకు మానవత్వంతో దాతలు ముందుకు రావటం అభినందనీయమని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో గురువారం గొల్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు విఘ్నేశ్‌గౌడ్ 230 మంది విద్యార్థినులకు దుప్పట్లను ఆర్డీఓ చంద్రకళ, తహసీల్దార్ కృష్ణయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు దాత విఘ్నేశ్‌గౌడ్ 10 వేల రూపాయలు ఇస్తానని ప్రకటించటం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా దాత విఘ్నేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి శ్వేతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దర్శనానికి భారీ ఏర్పాట్లు



ముస్తాబైన బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయం

తుక్కుగూడ: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ శ్రీ ఆదిలక్ష్మి అలువేలు మంగ సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం నుంచే స్వామివారి దర్శనానికి భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో క్యూ లైన్ల కోసం భారీ కేడ్లను ఏర్పాటు చేశారు. ఆలయానికి విద్యుత్ దీపాలు, రంగులతో అలంకరణ చేశారు. ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి రోజు ఇక్కడ సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు శేషం జగన్నాథాచార్యులు, శ్రీనివాసచార్యులు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర వైకుంఠం నుంచి స్వామి దర్శనానికి అనుమతిస్తామని వారు తెలిపారు.

సబితారెడ్డికి ప్రొటోకాల్ తెలియదా?

- పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి ప్రొటోకాల్ తెలియదా? అని పీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం మండల పరిధిలోని పడమటి తండాల్లో కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల పరిధిలోని పడమటి తండాల్లో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి అత్యుత్సాహం ప్రదర్శించి అధికారులు, ప్రజాప్రతినిధులను అవమానించారన్నారు. భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక పంచాయతీరాజ్ అధికారులు, మండల పరిషత్ అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా హడావిడిగా ఎమ్మెల్యే ప్రారంభించారన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు పంచాయతీ భవనం ప్రారంభోత్సావానికి వస్తారని చెప్పినా కూడా ఎమ్మెల్యే సబితారెడ్డి పెడచెవిన పెట్టి బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ప్రారంభించటం బాధాకరం. ఐదు సార్లు సబితారెడ్డి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా ఆమెకు రాజ్యాంగాన్ని, అధికార యంత్రాంగాన్ని గౌరవించాలన్న ధ్యాస లేకుండాపోయిందన్నారు. ఈ విషయం గురించి కలెక్టర్‌కు అర్ధ గంట ముందు చెప్పి ఎలా ప్రారంభిస్తారని ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సబితారెడ్డికి శిలఫలకాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి, ప్రొటోకాల్‌పై ఉండదని ఆయన విమర్శించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రవాపు ఇజ్రాయేల్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, పార్టీ సీనియర్ నాయకులు నేనావత్ రాజు నాయక్, యాదయ్య, నందిగామ నర్సింహ, సేవ్యా నాయక్, లాజర్, చంద్రమోహన్, భాస్కర్, శివ, రాజేందర్, బాల్‌రాజ్ పలువురు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: బ్రాహ్మణుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గౌరవరాజుల వెంకటేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘం నాయకులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన గౌరవరాజుల వెంకటేశ్వర్‌రావును ఎమ్మెల్యే సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో బ్రాహ్మణులకు అవసరమైన స్థలం, భవన నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి పండుగలు జరుపుకునే తేదీ విషయాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు రవి శర్మ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

జిల్లేడు చౌదరిగూడ మండలానికి చెందిన 63 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అందజేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.

హెచ్‌ఎండీఏ ఆదేశాలు బేఖాతరు

- గతంలో నిలిపేసిన వెంచర్లలో మళ్లీ పనుల జోరు
- త్వరలో జీహెచ్‌ఎంసీలో విలీనం రెచ్చిపోతున్న అక్రమార్కులు
- పట్టణంలో పత్తాలేని టౌన్‌ప్లానింగ్



హెచ్‌ఎండీఏ ఆదేశాలను ఉల్లంఘిస్తూ చేపడుతున్న నిర్మాణం, రహదారులు

శంషాబాద్: అక్రమార్కులు మళ్లీ రెచ్చిపోతున్నారు. హెచ్‌ఎండీఏ ఆదేశాలు కాస్తా పక్కన పెట్టేస్తున్నారు. త్వరలో జీహెచ్‌ఎంసీలో మున్సిపాలిటీ విలీనమైతే తమ పప్పులుడవేమోనని రెచ్చిపోతున్నారు. తమకు అనుకూలమైన ప్రజా ప్రతినిలున్నప్పుడే అక్రమ ×ఇళ్లు≈చక్కదిద్దుకునే పనిలో బిజీగా ఉన్నారు. పట్టణంలో టౌన్‌ప్లానింగ్ విభాగం మాత్రం తమకేమి పని అన్న తీరుగా వ్యవహరిస్తోన్న తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది.

ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో..

శంషాబాద్ మున్సిపాలిటీలో సాతంరాయితో పాటు హెచ్‌ఎండీఏ సొంతంగా అభివృద్ధి చేసిన న్యూ హుడా కాలనీలో మాత్రమే గృహ నిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తారు. మిగతా ప్రాంతమంతా జీవో 111 కారణంగా లేవుట్, నిర్మాలకు ఎలాంటి అనుమతి లేదు. శంషాబాద్ మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారి వారంలో కేవలం రెండు రోజులు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహిస్తారు. మిగతా పనిదినాలు మరో రెండు మున్సిపాలిటీల్లో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. దీంతో టౌన్‌ప్లానింగ్‌లో ఓ ప్రభుత్వ ఉద్యోగి మినహా మిగతా పనిచేసే సిబ్బంది ఔట్‌సోర్సింగ్ మాత్రమే.. దీంతో పట్టణంలో లెక్కలేనన్ని అక్రమ నిర్మాణాలు, లేఅవుట్‌లు నియంత్రించడంలో తీవ్రంగా విఫలమవుతోంది. ఒక వేళ కొన్ని సందర్భాల్లో చర్యలు తీసుకున్నా ప్రజా ప్రతినిధుల ఆదేశాలతో మళ్లీ వాటివైపు తొంగి చూసే పరిస్థితి లేకుండా పోతోంది.

ఆదేశాలు..బుట్టదాఖలు

పట్టణంలో అక్రమ లేఅవుట్‌లకు అనుమతి లేకపోవడంతో అక్రమార్కులు వాటిని గుంటల లెక్కన విక్రయిస్తున్నారు. ఈ విషయం ఏడాది కిందట హెచ్‌ఎండీఏ అధికారుల దృష్టికి వెళ్లడంతో పలు లేఅవుట్‌లను నిలిపివేశారు. వాటిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండా చూడాలని మున్సిపాలిటీకి సూచించారు. దీంతో పనులు నిలిపివేసిన సదరు అక్రమ లేఅవుట్ నిర్వాహకులు ఇటీవల మళ్లీ తమ అక్రమ లేఅవుట్‌లలో జోరుగా పనులు చేపడుతున్నారు. హెచ్‌ఎండీఏ ఆదేశాలను బుట్టదాఖలు చేశారు. పట్టణంలోని సర్వేనంబరు 51 తదితర ప్రాంతాల్లో జోరుగా అక్రమ లేఅవుట్‌లతో పాటు అందులో భారీ నిర్మాణాలు జోరందుకున్నాయి. ధర్మోజి కుంట సమీపంలో కూడా ఓ భారీ భవనంతో పాటు షెడ్ల నిర్మాణం కూడా ఊపందుకుంది. మున్సిపాలిటీ జీహెచ్‌ఎంసీలో విలీనం కాక ముందే తమ అక్రమాలన్నింటిని చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు ఇంటి నెంబర్లు ఇప్పించి అవే అనుమతులుగా అంటగడుతూ కొందరు ప్రజాప్రతినిధులు ఇప్పటికే భారీగా సొమ్ముచేసుకున్నారు. మరో 20 రోజులే ఉండడంతో ప్రస్తుతం ఇంటి నెంబర్లు ఇప్పించే పనిలో కొందరు కౌన్సిలర్లు మున్సిపాలిటీ క్యూ కడుతున్నారు.



> **పరిశీలించి చర్యలు తీసుకుంటాం**
>
> సర్వేనంబరు 51లో ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదు. అక్రమ నిర్మాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. టౌన్‌ప్లానింగ్ అధికారులు సదర సర్వేనంబర్లలో పరిశీలిస్తారు. అక్రమ నిర్మాణాలను ఉపేక్షించేది లేదు.
>
> – బి. సుమన్‌రావు, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386